

లోకాయుక్తకు చిక్కిన రికార్డ్ అసిస్టెంట్

రాయచూరు, మే 22 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా ఏడీఎల్‌ఆర్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆదెప్ప లోకాయుక్త అధికారులకు బుధవారం పట్టుబడ్డాడు. ఏడీఎల్‌ఆర్ కార్యాలయంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆదెప్ప. రైతు రామప్ప తన ఖాతా మార్పునకు సంబంధించి రి కార్డు వివరాలు కోరగా రూ.8 వేలు డిమాండ్ చేశాడు. రైతు అందుకు సమ్మతిం చి డబ్బులు చెల్లించేందుకు సిద్ధపడగా విషయం తెలుసుకున్న లోకాయుక్త అధికారులు బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఆదెప్పను రిమాండ్‌కు తరలించారు. అతడిపై కేసు నమోదు చేస్తున్నట్లు లోకాయుక్త అధికారులు తెలిపారు.

నగరంలో సీఎం విస్తృత పర్యటన


అధికారులతో కలిసి బ్లూప్రింట్ పరిశీలిస్తున్న సీఎం, డీసీఎం తదితరులు


బీబీఎంపీ కమిషనర్‌కు సీఎం సూచనలు

అభివృద్ధి పనులు, రాజకాలువల పరిశీలన

వర్షాకాలంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

పాల్గొన్న డీసీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలతోపాటు అభివృద్ధి పనులు సాగుతున్న తీరుపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు మంత్రి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర నగరపాలక, బీబీఎంపీతోపాటు వివిధశాఖల అధికారులతో కలసి పర్యటించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించానన్నారు. బీబీఎంపీ, జలమండలి, బీడీఏ, బెస్కాం పరస్పర సహకారంతో అభివృద్ధి పనులలో భాగస్వాములు కావాలని సూచించానని పేర్కొన్నారు. మెట్రో, ఫ్లై ఓవర్‌తోపాటు నిర్మాణాల పనులను పరిశీలించానని అన్నారు. వర్షాకాలంలో ఎక్కడా ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యలహంకలో 20ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాన్ని డీసీఎం డీకే శివకుమార్ పరిశీలించి వచ్చారన్నారు. మైసూరు రోడ్డు గాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద వర్షపునీరు ప్రవహించేందుకు ప్రస్తుతం ఉన్న ఒక కాలువ సరిపోవడం లేదని ప్రత్యామ్నాయ కాలువ నిర్మించాలని సూచించానన్నారు. నగర వ్యాప్తంగా 860 కిలోమీటర్లు రాజకాలువ ఉందన్నారు. గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు 491 కిలోమీటర్ల ఆక్రమణలను తొలగించామన్నారు. గత ఏడాది 193 కిలోమీటర్ల ఆక్రమణలు తొలగించారని ఇదే పని ముందుగా చేసి ఉంటే సమస్యలు వచ్చేవి కావన్నారు. నగరవ్యాప్తంగా 5,500 గుంతలు పడినట్టు గుర్తించారని, నెలరోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. రాజకాలువ ఆక్రమణలను తొలగించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఫొటో షూట్‌కోసం వెళ్లారంటూ ప్రతిపక్షనేత అశోక్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అశోక్ ఎప్పుడూ వాస్తవాలు మాట్లాడరని పేర్కొన్నారు. ప్రజ్వల్ వివాదాన్ని పక్కకు తప్పించేందుకే ఫోన్‌ట్యాపింగ్ అంటూ కుమారస్వామి తెరపైకి తెచ్చారన్నారు.


రాజకాలువలో పూడికతీత పనులు ఇలా...

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన సీఎం సిద్దరామయ్య


పరిశీలిస్తున్న సిద్దరామయ్య, డీకే శివకుమార్ తదితరులు

బొమ్మనహళ్లి, మే 22: బొమ్మనహళ్లి నియోజకవర్గంలోని బిలేకహళ్లి, కోడిచిక్కనహళ్లి, సిల్క్‌బోర్డ్ తదితర చోట్ల లోతట్టు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పర్యటించి స్వయంగా పరిశీలించారు. బుధవారం వారు పర్యటించి బీబీఎంపీ, జలమండలి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షం ఎంత కురిసినా సమస్యలు లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనుగ్రహ లే అవుట్ తదితర వర్షపీడిత ప్రాంతాల ప్రజల సమస్యలను ఆలకించారు. రాజకాలువ ఆక్రమణలు తొలగించి ముంపు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెట్రో రైలు వెళ్లే మార్గం కూడలిని సీఎం ఆసక్తిగా పరిశీలించారు. రోడ్లు, కూడళ్లలో వర్షపునీరు నిల్వకాకుండా చూడాలన్నారు. మంత్రులు రామలింగారెడ్డి, బైరతి సురేశ్, జార్జ్, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, బీడీఏ అధ్యక్షుడు హారిస్, బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్, బొమ్మనహళ్లి జాయింట్ కమిషనర్ అజయ్ వివిధశాఖ అధికారులతోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు అశ్వత్థ నారాయణస్వామి, రాఘవేంద్ర

పెరుగుతున్న అంతరం

సీఎం తీరుపై డీసీఎం అసంతృప్తి

పార్టీలో డీకే వ్యాఖ్యల దుమారం

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య అంరం పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమైన కార్యక్రమాలకు సీఎం తనను పిలవలేదని డీకే అసంతృప్తి వెళ్లగక్కినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తన సారథ్యంలోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, 135 స్థానాలు సాధ్యమయ్యాయని ఉపముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. ప్రత్యేకించి కాంగ్రెస్ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేస్తోంది. ఏడాది పాలన విజయవంతంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య మీట్ ది ప్రెస్‌లో పలు అభిప్రాయాలు వ్యక్తం చేయడంతోపాటు రాజీవ్‌గాంధీ వర్ధంతి వేళ ఉగ్రవాద నియంత్రణ దినోత్సవ ప్ర తిజ్ఞ సందర్భంలోనూ డీకే శివకుమార్ లేకుండానే కొనసాగించడంతో కాస్త అసంతృప్తితోనే వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. విధానసౌధలో మంగళవారం ప్రతిజ్ఞ సందర్భంగా డీసీఎం వస్తున్నారంటూ వ్యక్తిగత కార్యదర్శులు, పలువురు అధికారులు సూచించగా వస్తే పాల్గొంటారని సీఎం కరువుగా సమాధానం ఇచ్చారనే అంశం హల్‌చల్ చేసింది. ఏడాది పాలన విజయవంతం సందర్భంగా కేపీసీసీలో పలువురు పదాధికారులు డీకే శివకుమార్‌ను సత్కరించిన సందర్భంలో మాట్లాడుతూ ఏడాది పాలన విజయవంతం ముఖ్యం కాదని, నాలుగేళ్ల తన నాయకత్వాన్ని కొనసాగించినందుకు పార్టీ అధికారంలోకి వచ్చిందని దీటుగా వ్యాఖ్యానించారు. పరోక్షంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి తానే నాయకుడంటూ చెప్పుకున్నారు. పరిషత్ టిక్కెట్ల కోసం వచ్చేవారిని ఘాటుగానే హెచ్చరించారు. తెల్లజుబ్బా వేసుకుని కారులో హుందాగా వచ్చి హోదా కావాలని ప్రతిపాదించడం కాదని, బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, ఎంతమేర ఓట్లు సాధించారనేది ముఖ్యమని లేదంటే ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని హెచ్చరించారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో మీ పరిధిలోని బూత్‌లలో ఎంత ఓట్లు సాధించారో తెలుస్తుందన్నారు. గెలుపోటములకంటే లీడర్‌గా చెప్పుకునేవారు యాక్టివ్‌గా ఉండాలని లేదంటే పక్కకు తప్పించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాలుగు ఓట్లు వేయించలేనివారు ఎమ్మెల్సీ టిక్కెట్లు అడుగుతారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యేల కోటాలో 11 స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో కాంగ్రెస్ నుంచి ఏడుగురిని ఎన్నుకునే అవకాశం ఉంది. పలువురు ఆశావహులు అటు సీఎం నుంచి పేరు సిఫారసు చేసుకునే ప్రయత్నంపైనే డీకే శివకుమార్ స్పందించినట్టు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో రాజకీయ మునలం తప్పదనే సంకేతాలు ఇచ్చినట్టయ్యింది.


సిద్దరామయ్య


డీకే శివకుమార్

అరకొర వేతనాలతో అగచాట్లు

రెసిడెన్షియల్ ఉపాధ్యాయులను పట్టించుకోని ప్రభుత్వాలు

రూ.9వేలతో నెట్టుకొస్తున్న వైనం

వారి కృషితోనే ఎస్‌ఎస్‌ఎల్‌సీలో ఉత్తమ ఫలితాలు

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎస్‌ఎల్‌సీ ఫలితాల్లో గత ఐదారేళ్లుగా రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులు టాపర్లుగా నిలుస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో బాగల్కోటె జిల్లా ముధోళ తాలూకా మళ్లిగెరె మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని అంకిత కొణ్ణూరు 625 మార్కులకు 625 సాధించి రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచారు. అంకిత మార్కులు సాధించడాన్ని రాష్ట్రంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు గర్వంగా భావించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నెలకు రూ. 9వేల జీతంతో నానాకష్టాలు పడుతున్నారు. భార్యాపిల్లలను పోషించుకునేందుకు తల్లడిల్లే పరిస్థితి నెలకొంది. చదువు నేర్పే పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్య అందించామనే సంతృప్తితో గర్వపడుతున్నా.. కన్నబిడ్డలకు ఫీజులు చెల్లించేందుకు వెనుకాముందు ఆలోచించే పరిస్థితి దాపురించింది. అంకిత చదివిన రెసిడెన్షియల్ స్కూల్లో సైన్స్, మ్యాథ్స్, కన్నడ బోధించే ముగ్గురు ఉపాధ్యాయుల వేతనాలు సాధారణ కూలీలకంటే తక్కువగానే ఉన్నాయి. 15ఏళ్ల క్రితం రూ.3,600 జీతానికి చేరిన వారు ప్రస్తుతం నెలసరి రూ.9వేల వేతనం పొందుతున్నారు. ఇది కేవలం వీరి ముగ్గురి కష్టమే కాదు. సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 830 రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేసే వందలాదిమంది అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వీరిలో 35మంది ప్రిన్సిపాళ్లు, 481 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఉపాధ్యాయులకు సేవాభద్రత కల్పించాలని 2020లో హైకోర్టు ఆదేశించినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. 2023 మార్చిలో రెసిడెన్షియల్‌స్కూల్ ప్రిన్సిపాళ్లకు 2011 నుంచి 2023 వరకు అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సర్వీస్‌కు సంబంధించి సమగ్ర నివేదికను ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. 15రోజుల్లోనే కేంద్ర కార్యాలయానికి నివేదిక చేరాలని సూచించి ఏడాది ముగుస్తోంది. అయినా ఎటువంటి ప్రగతికి నోచుకోలేదు. మళ్లిగెరె ఉపాధ్యాయులు గురురాజ్, వెంకప్ప బళూల, మోహన్ కారబారి అభిప్రాయం మేరకు రాత్రింబవళ్లు తేడా లేకుండా పాఠశాలలోనే ఉంటూ చదువు నేర్పుతున్నామన్నారు. కానీ తమకు నెలకు రూ.9వేలు మాత్రమే జీతం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పాఠశాలలో వంట మనుషులకు నెలకు రూ.21వేలు, స్వీపర్‌లకు రూ.17వేలు, సెక్యూరిటీకి రూ.17వేలు ఇస్తున్నారని, కానీ తమకు మాత్రం వేతనాలు కనీసంగా కూడా లేవని విచారం వ్యక్తం చేశారు.

మళ్లిగెరె మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్


గెస్ట్ టీచర్ల నియామకంలో తాత్సారం

విద్యాశాఖ నిర్లక్ష్యం

మరోవారం రోజుల్లో విద్యాసంస్థల ప్రారంభం



బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, అధ్యాపకుల నియామకాలు వివిధ కారణాలతో కొన్నేళ్లుగా వాయిదాపడుతూ వస్తున్నాయి. మరోవైపు ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఉపాధ్యాయులతో మాత్రమే విద్యాసంవత్సరాన్ని కొనసాగించడం కష్టతరం కావడంతో ఏటా గెస్ట్ టీచర్లను నియమించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈనెల 29న 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభించనున్నారు. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖ నాలుగు వారాల కిందటే ఆదేశాలు జారీ చేసింది. విద్యాసంస్థలు సకాలంలోనే ప్రారంభమవుతాయి. ఉపాధ్యాయులు లేకుంటే తరగతులు ఎలా కొనసాగించాలనేది ప్రశ్నార్థకమవుతోంది. పాఠశాల ప్రారంభం నాటికే యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ అతిథి ఉపాధ్యాయులను నియమించుకునే విషయంలో విస్మరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులకంటే అతిథి ఉపాధ్యాయులను నియమించుకుని విద్యాసంవత్సరాన్ని పూర్తి చేయడమే తంతుగా మారింది. 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో ప్రాథమిక, హైస్కూళ్ల దాకా 43వేల మంది గెస్ట్ టీచర్లు పనిచేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకు దాదాపు అన్ని విద్యాసంస్థల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరగడమే కారణమవుతోంది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. విధాన పరిషత్ ఎన్నికల హోరు సాగుతోంది. జూన్ 3న పోలింగ్ జరగనుంది. ఎన్నికల కారణంతోనే ఉపాధ్యాయల నియామకాల ఉత్తర్వులు జారీ జాప్యమవుతున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలు జరిగే విధానంలో రహస్యమేమీ లేదు. ముందుగానే లోక్‌సభ, విధానపరిషత్ సమరం ఉంటుందనేది తెలిసిందే. ముందస్తుగానే విద్యాశాఖ ఎందుకు అప్రమత్తం కాలేదనేది విద్యానిపుణులు ప్రశ్నిస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లో 34,80మంది, ప్రాథమికోన్నత, పాఠశాలల్లో కలిపి 8వేల మందితో కలిపి 42,890మంది గెస్ట్ టీచర్లు పనిచేశారు. ఈ సంవత్సరం మరింత ఎక్కువమందిని నియమించుకునే అవసరం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు అతిథి ఉపాధ్యాయుల అంశాన్ని శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. గతంలో ఎన్నికైనవారు ఇదే హామీ ఇచ్చారు. దశాబ్దాలకాలంగా అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చొరవ చూపలేదనే విమర్శలు ఉన్నాయి.

మాజీ ఎంపీ ఇక్బాల్ అహ్మద్ కన్నుమూత




బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): కలబురగి మాజీ ఎంపీ ఇక్బాల్ అహ్మద్ సరడగి (79) కన్నుమూశారు. వయోసహజ ఆరోగ్య సమస్యలతోబాధపడుతున్న ఆయన కలబురగిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి పొద్దుపోయాక తుదిశ్వాస వీడారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆప్తుడిగా ఇక్బాల్ అహ్మద్ గుర్తింపు పొందారు. 1944 జూన్ 5న మహ్మద్ అహ్మద్ సరడగి, గౌహర్ బేగం దంపతులకు ఇక్బాల్ అహ్మద్ జన్మించారు. కలబురగి సైన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో లా కోర్సు చేశారు. 1999, 2004లలో జరిగిన ఎన్నికల్లో కలబురగి ఎంపీగా రెండుసార్లు ఎన్నికయ్యారు. 2008లో నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో కలబురగి ఎస్సీ రిజర్వుగా మారింది. ఒకసారి విధానపరిషత్ సభ్యుడిగాను కొనసాగారు. ఇక్బాల్ అహ్మద్ మృతి పట్ల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సహా పలువురు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే కలబురగిలో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బుధవారం ఉదయం దర్గా ప్రదేశంలో నేషనల్ కళాశాల మైదానం వద్ద అంతిమదర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. సాయంత్రం హఫ్తగుంబజ్‌లో ఖననం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, శరణుప్రకాశ్ పాటిల్‌తోపాటు పలువురు సంతాపం తెలిపారు.

పరిషత్ ఎన్నికలపై బీజేపీ నేతల చర్చ

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి)

పరిషత్ ఎన్నికలపై బీజేపీ కోర్ కమిటీలో కీలక చర్చ జరిగింది. బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ప్రతిపక్షనేత అశోక్, సీనియర్ నేత యడియూరప్ప, సీటీ రవి, సునిల్‌కుమార్, నిర్మల్ కుమార్ సురానా, అశ్వత్థనారాయణ, బసవరాజ్ బొమ్మై, ప్రహ్లాద్‌జోషి, సదానందగౌడ తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల తీరుపైనా చర్చ జరిగినట్టు సమాచారం. నాయకులంతా సమష్టిగా పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థుల తరపున ప్రచారానికి సిద్ధం కావాలని నిర్ణయించారు.


బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ప్రముఖులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.51	1,579.10
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	580
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	0	178
సామర్థ్యం (టీఎంసీలు)	3.38	4.05

నేడు వడకరాయ స్వామిరథోత్సవం



బ్రహ్మరథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారి సిటీ,మే 22: హొసపేటలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వడకరాయ రంగస్వామి రథోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనుమంతప్ప తెలిపారు. హిందూ ధర్మదాయ శాఖ పరిధిలోకి వచ్చే ఈ ఆలయానికి గొప్ప చరిత్ర ఉంది. వారం రోజుల నుంచి వివిధ ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బ్రహ్మరథోత్సవాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు రథోత్సవం

గురువారం పూర్ణిమను పురస్కరించుకుని ఉదయం మడితేరు, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. జా తర మహోత్సవం సందర్భంగా ఆలయంతో పాటు పలు సంస్థలు, పరిసర సంస్థలు కూడా తీర్థప్రసాదాలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి



బీడీపీఐకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, మే 22: తాలుకాలోని గ్రామీణ ప్రాంతాల్లో హైస్కూలు, ప్రైమరీ స్కూలు విద్యార్థులకు వసతులు కల్పించాలని బీడీపీఐ ఉమాదేవి, క్షేత్ర శిక్షణ అధికారి రంజాన్ సాబ్‌లకు కర్ణాటక రక్షణ వేదిక గ్రామీణ అధ్యక్షులు పంపన్నగౌడ వినతిపత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో హైస్కూలు, ప్రైమరీ స్కూళ్లలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని పాఠశాల ప్రారంభోత్సవానికి ఇంకా 20 రోజులు ఉన్నందువల్ల వెంటనే పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చాంద్ బాషా, యర్రిస్వామి గౌడ, గౌరవ ఉపాధ్యక్షులు అంజనేయ, హనుమంతు, ఏకే రాజు, పలు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి నగరం ఉలిక్కిపడింది



- బళ్లారి కేంద్రంగా గంజాయి విక్రయించే ముఠా పట్టివేత
- తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్న వ్యక్తుల అరెస్ట్
- ఆందోళన చెందుతున్న నగరవాసులు

బళ్లారి, మే 22(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరంలో ఒక్కసారిగా అసాంఘిక శక్తుల ఆనవాళ్లు బయటపడడమే ఇందుకు కారణమని చెప్పవచ్చు. గంజాయి విక్రయించే వ్యక్తులు ఓ వైపు, తీవ్రవాద సంబంధాలున్న అతివాదులు మరోవైపు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. కౌల్‌బజార్‌లో గంజాయి విక్రయించే వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. అలాగే బళ్లారికి అనుకునే ఉన్న అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఒక విశ్రాంతి హెచ్.ఎం ఇంటిని సోదా చేశారు. ఆ హెచ్ఎం కుమారుడు బెంగళూరులో ఉంటూ తీవ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నారనే అనుమానాన్ని ఎన్ఐఏ వ్యక్తం చేసింది. ఒక్కసారిగా ఈ విషయాలు వెలుగులోకి రావడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు.



సిరుగుప్ప వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు(ఫైల్‌ఫొటో)

మొదటగా పోలీసులకు కౌల్‌బజార్‌లో గంజాయి విక్రయించే వ్యక్తుల ఆచూకీ చిక్కింది. వారిని విచారించగా మరికొన్ని ఆశ్చర్యకరమైన అంశాలు వెల్లడయ్యాయి. వీరి ఆధ్వర్యంలో సమీపంలోని కర్నూలు జిల్లా ఆలూరులో సాగవుతున్న గంజాయి తోటను గుర్తించారు. అక్కడ నుంచి తెచ్చి వీరు నగరంలో గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. పోలీసులు కర్నూలుకు వెళ్లి అక్కడ సాగుదారులను కూడా అదుపులోకి తీసుకోవడంతో ఈ ముఠా గుట్టు రట్టయింది. గతంలో సండూరు, సిరుగుప్ప, కుడితిని, కురుగోడు, తదితర ప్రాంతాల్లో గంజాయి సాగు చేసే వ్యక్తులను పోలీసులు గుర్తించారు. వీరిలో కొందరిని అదుపులోకి కూడా తీసుకున్నారు.

తాజాగా మంగళవారం కర్నూలు జిల్లా అలూరులో గంజాయి సాగు చేసేవారిని, సరఫరా చేసే వారిని పట్టుకున్నారు. గంజాయి సాగు చేయించే వ్యక్తులు కొందరు రైతులతో ముందుగా ఒప్పందం చేసుకుని వారి పొలాల్లో ఆ పంట నాటిస్తున్నారు. ఈ విషయం పోలీసుల విచారణలో తేలింది. బళ్లారి కౌల్‌బజార్, కాకర్లతోట, శ్రీరాంపుర కాలనీ, గుగ్గరహట్టి, బండిమోట, హుసేన్‌నగర్, విశాల్‌నగర్‌లలో ఎక్కువగా గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే కొన్ని ఇంజనీరింగ్, మెడికల్, కళాశాలల వద్ద, పీజీ సెంటర్ల వద్ద గంజాయి అమ్ముతున్నారని తెలుస్తోంది.

గంజాయితో తయారు చేసిన చాక్లెట్లను ఇటీవల ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. తోరణగల్లు, జిందాల్ ప్రాంతంలో ఎక్కువగా గంజాయితో తయారు చేసిన చాక్లెట్లను పట్టుకున్నామని ఎక్సైజ్ కమీషనర్ తెలిపారు. గంజాయి విచ్చల విడిగా అమ్మకాలు చేస్తుండంతో యువత పూర్తిగా పెడదారి పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. గంజాయి మత్తులోపడి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోంది. యువత చెడిపోకుండా ఉండాలంటే ప్రజాప్రతినిదులు, పోలీసులు, గంజాయి విక్రయించేవారిని కఠినంగా శిక్షంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఆచూకీ చిక్కిన రిటైర్డ్ హెచ్.ఎం కుమారుడు బళ్లారికి చెందిన అమ్మాయినే వివాహం చేసుకున్నాడు. గతంలో బళ్లారిలో ఎన్ఐఏ తనిఖీలు చేసినప్పుడు తీవ్రవాద సంస్థలతో టచ్‌లో ఉండే అనుమానిత వ్యక్తుల పేర్లను కూడా ఎన్ఐఏ సేకరించింది. వారి ఫోన్‌కాల్స్, ఎప్పుడు ఎవరితో మాట్లాడారనేవన్నీ రికార్డుల్లో ఉన్నాయి. అంతేకాకుండా ఏప్రిల్ నెలలో ఎన్ఐఏ సంస్థ బళ్లారిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. వీరికి తీవ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు అనుమానించింది. ఇలా విచ్చల విడిగా గంజాయి విక్రయించేవారితో పాటు తీవ్రవాద సంస్థలతో సంబంధం ఉండే వ్యక్తుల గుట్టు బయట పడుతుండడంతో నగర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

పావగడ, మే 22: పట్టణంలోని మీన నర్సింగ్ హోంకు, అరవింద్ చిల్డ్రన్ హాస్పిటల్‌కు మధ్యలో తపాల నారాయణ(33) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు రాయితో కొట్టి హత్య చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని బాబయ్యగుడి వీధికి చెందిన తపాల నారాయణ కొబ్బరికాయలు ఒలిచి జీవనం సాగించేవాడు. అతడు మామూలుగానే మంగళవారం సాయంత్రం తన ఇంటికివెళ్లి తల్లితోనూ, భార్యతోనూ మాట్లాడి తిరిగి పనికోసం పట్టణంలోకి వచ్చాడు. బుధవారం ఉదయం అతడు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అతడికోసం కుటుంబసభ్యులు అంతటా వెదుకుతుండగా, అతడు హత్యకు గురైనట్లు వారికి సమాచారం అందింది. విషయం తెలిసిన వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఇది ముమ్మాటికి హత్యేనని భార్య లక్ష్మీదేవి, కూతురు అనితలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించి ఈ మేరకు కేసు నమోదు చేశారు. కాగా బాలాజీ హోటల్ దగ్గర ప్రతి రోజూ మద్యం ప్రియులు ఎప్పుడూ గొడవపడుతూ ఉంటారని, దీన్ని వల్ల ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు కూడా ఇబ్బందిగా ఉంటుందని ఆసుపత్రి వైద్యులు పోలీసులకు తెలిపారు. ఎవరో మద్యం మత్తులో హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. సీసీకెమెరాల ద్వారా హంతకులను తక్షణమే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.



మొక్కజొన్న పంట విత్తుతున్న రైతులు

మొక్కజొన్న సాగుకు సమాయత్తం

కంప్లి, మే 22 : కొట్టూరు గ్రామంలో విస్తారంగా వర్షాలు కురిసి భూములు తేమ కావడంతో రైతన్నలు మొక్కజొన్న పంట సాగు చేసేందుకు ముందుకొచ్చారు. గతేడాది కంటే ఈ యేడాది సకాలంలో ముంగారు వర్షాలు రావడంతో సేద్యం చేసుకుని విత్తనాలు విత్తుకునేందుకు రైతన్నలు సిద్ధమయ్యారు.

ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్

సిరుగుప్ప, మే 22 : ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్‌కు ఓటు వేయాలని బళ్లారి నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి ఓటర్లను కోరారు. సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు తప్పనిసరిగా బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ధరప్ప నాయక్, మల్లికార్జున స్వామి, ప్రధాన కార్యదర్శి దొడ్డ ఉలిగప్ప, పాల్గొన్నారు.

కంప్లి, మే 22 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు అందుబాటులో వుంటూ అభివృద్ధి పనులు చేసే వారిని ఎన్నుకోవాలని బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ తెలిపారు. కంప్లి పట్టణం శారదా పాఠశాలలో బీజేపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మెల్సీగా వున్న సమయంలో ఖాళీగా వున్న టీచర్ పోస్టులను భర్తీ చేయించామన్నారు. కార్యక్రమంలో హళ్లి వీరేష్, అనిల్ నాయుడు, విరుపాక్షిగౌడ, నాగరాజు, సోమనాథ్ స్వామితదితరులు పాల్గొన్నారు.

జేఈఈ పరీక్షా కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు

బళ్లారి సిటీ, మే 22: నగరంలో మే 26న నగరంలోని 2కేంద్రాల్లో జేఈఈ పరీక్షలను నిర్వహించాలని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశించారు. జేఈఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2-30గంటల నుంచి సాయంత్రం 5-30గంటల వరకు నగరంలోని బీఐటీఎం కళాశాల ,కిష్‌కింద్ యూనివర్శిటీ కేంద్రాల్లో జరుగుతాయి. పరీక్షా కేంద్రాల చుట్టూ 200మీటర్ల లోపు ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. ఈ ఉత్తర్వు ప్రకారం అనధికార వ్యక్తులు , వ్యక్తుల సమూహాలకు ప్రవేశాన్ని పరిమితం చేసింది. పరీక్షా కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ దుకాణాలను ఉదయం 8గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు తాత్కాలికంగా మూసివేయాలన్నారు.

జొన్నల్లో పుచ్చులున్నాయ్!

కొనుగోలు కేంద్రంలో రైతులకు అధికారుల వేధింపులు

బళ్లారి సిటీ, మే 22: బళ్లారి నగరం ముండ్రగి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని జొన్నల కొనుగోలు కేంద్రంలో అధికారులు అనవసరంగా సమస్యలు సృష్టిస్తున్నారని కర్ణాటక రైతు సంఘం జిల్లాధ్యక్షులు సంగకల్లు కృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ ట్రాక్టర్, ఆటోలలో తీసుకొచ్చిన జొన్నలను గోడౌన్ బయట అన్‌లోడ్ చేసి తూకం వేసి తదనంతరం గోడౌన్‌లోకి పంపిస్తారన్నారు. దీని ద్వారా రైతులకు చింతాల్ కూలి, హమాలి కూలి ఎక్కువ అవుతోందన్నారు. అంతేకాకుండా జొన్నల్లో సచ్చులు, పుచ్చులున్నాయని సరిగాలేవని మళ్లీ వాపసు పంపుతున్నారని ఆరోపించారు. రైతులకు సమస్యలు సృష్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేన ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా తాలూకా అధ్యక్షులు ఎర్రిస్వామి, మారెణ్ణ, తాలూకా ఉపాధ్యక్ష ఖన్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియంలో ఆఫ్రికా శిలాజాలు



ప్రదర్శనకు ఉంచిన ప్రాచీన శిలాయుగ శిలాజాలు

బళ్లారి సిటీ, మే 22: నగరంలోని రాబర్ట్ బ్రూస్‌ఫుట్ ఫ్లింట్ ఆర్కియాలజీ మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం ఆఫ్రికాలో లభించిన పురాతన శిలాయుగపు రాతి శిల్పాల 3డీ ప్రతిరూపాలను పదర్శనకు ఉంచారు. ఈత్రిడీ మోడళ్లను అమెరికాకు చెందిన బోనాక్లోన్స్ అనే కంపెనీ నుంచి ప్రముఖ పాలియోంటాలజిస్ట్ డాక్టర్ రవి కోరిశెట్టర్ కొనుగోలు చేసి మ్యూజియానికి బహూకరించారు. మ్యూజియం నిర్వహణ కమిటీ సభ్యులు సంతోష్ మార్టిన్ ఎం అహిరాజ్ ఈ త్రీడీ మోడళ్లను కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు నాగరాజుకు ఇవ్వగా ఆయన వాటిని ప్రదర్శనకు ఉంచడం విశేషం. మ్యూజియంలో ప్రదర్శించిన ప్రత్యేక శిలాజాలను ప్రజలు ముఖ్యంగా చరిత్ర విద్యార్థులు వీక్షించాలని ప్రజలు కూడా వాటిని వీక్షించవచ్చని కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు నాగరాజు అభిప్రాయపడ్డారు.

ఆలూరు, యంబలి గ్రామాల మధ్య రాకపోకల బంద్

బళ్లారి సిటీ, మే 22: గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాలూకాలోని యంబలి వడ్డరహట్టి, కెంచ మల్లనహళ్ళి, ఆలూరు, యంబలి గ్రామాలను కలిపే రహదారి కొట్టుకుపోయి కనెక్షన్ తెగిపోయింది. హొసహట్టి జయమ్మ, మారన్న, మల్లమ్మ, సన్నఓబయ్య, కురిహట్టి బోరన్న తదితరులకు చెందిన 20 ఎకరాలకుపైగా తమలపాకుల తోటలు దెబ్బతిన్నాయి. లోకేశ్‌కు చెందిన బొప్పాయి, కొరచనహట్టి జయన్న, చన్నబసన్నకు చెందిన టమోట పంటలు వర్షం కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చాలచోట్ల విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయి. ఎలాంటి ప్రమాదం జరగలేదు. మొత్తం మీద వర్షాలకు రైతులు, ప్రజాప్రతినిధులు రూ.లక్షల్లో నష్టపోయారు. తాలూకాలోని గండబొమ్మనహళ్ళి సమీపంలోని గోశాలలోని షెడ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో షెడ్లు పూర్తిగా బురదతో నిండిపోయి పశువులను బయట కట్టి మేపుతున్నారు. అలాగే నిల్వ ఉన్న పశుగ్రాసం కుప్పలోకి నీరు చేరి సమస్యగా మారిందని గ్రామస్థులు పేర్కొన్నారు.



యంబలి వడ్డరహట్టి, కెంచమల్లనహళ్ళి, ఆలూరు గ్రామాల మధ్య తెగిపోయిన రోడ్డు



పీడీ హళ్లి సమీపంలో వర్షపునీటితో ప్రవహిస్తున్న వేదావతి

వరదనీటితో వేదావతి పరవళ్లు

బళ్లారిరూరల్, మే 22 : బళ్లారి నగరంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా వేదావతి నది వర్షపునీటితో పొంగి ప్రవహించింది. వేదావతి నదిలో తాగడానికి నీరు లేక పశువులతో పాటు గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. అయితే మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఎండిపోయిన వేదావతి ఒక్కసారిగా వర్షపు నీరు ముంచెత్తింది. దీంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కాపు తగ్గిన మామిడి చెట్లు



రైతు జంబునాథ తోటలో కాయలులేని మామిడి చెట్లు

కంప్లి, మే 22 : ఈ యేడాది అనుకున్న స్థాయి కన్నా మామిడి పంట దిగుబడి తగ్గిందని మామిడి పెంపకందారులు వాపోతున్నారు. ఎండల ప్రభావంతో పూత పూర్తిగా రాలిపోయి కాస్తో కూస్తో పంట రాగా అది కూడా అకాల వర్షాలతో నష్టపోయామని రైతులు వాపోతున్నారు. కౌలు రైతు మావినళ్లి తాయన్న మాట్లాడుతూ ఈ యేడాది పెట్టుబడులు కూడా రాకుండా పోయాయన్నారు. తెచ్చిన అప్పులు కూడా కట్టలేక కష్టాలు ఎదురయ్యాయని తెలిపారు. ఈ యేడాది పూర్తిగా పంటలు దిగుబడి తగ్గిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

హొసూరు జోన్

నాయకత్వ నిర్వహణపై ముగిసిన సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

హొసూరూ, మే 22: నగరంలోని అదియమాన్ కళాశాలలో నాయకత్వ నిర్వహణ అనే అంశంపై మూడు రోజులపాటు జరిగిన సదస్సు విజయవంతంగా ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాథ్ ప్రారంభోపన్యాసం చేయగా, అశోక్ లైలాండ్ డీజీఎం రవిచంద్రన్, స్పీడ్ మోటార్స్ నరేశ్ కుమార్, లక్ష్మణన్, డీన్ డాక్టర్ ధనశేఖర్, పీహెచ్‌డీ మేనేజర్ కుమార్, టైటాన్ కంపెనీ చైర్మెన్ డా.సునీల్ జజిత్, డిజిఎం(హెచ్ఆర్), టయోటా డిజిఎం బిజేంద్ర షాలు పాల్గొన్నారు. విభాగాధిపతి డాక్టర్ ధనశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. మూడు రోజుల కార్యక్రమాన్ని డాక్టర్ ప్రొఫెసర్ సురేశ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియా తదితరులు నిర్వహించారు.



రాజీవ్‌కు ఘన నివాళి

హొసూరూ, మే 22: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీపెరంబుదూరులోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నం వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సల్వపెరుందురై తిరునావకరసు, తంగబాలు, తమిళనాడు ఐఎన్‌టీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుప్పుస్వామి పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు తోడ్పాటునందించాలి

రాయచూరు, మే 22 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాయచూరు జిల్లాలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రతలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.శరణప్రకాశ్ పాటీల్ సూచించారు. కరువు పరిహారం కార్యక్రమాల నిర్వహణతో పాటు ప్రభుత్వ పరంగా చేపట్టే కార్యక్రమాల్లో కోడ్ ఉల్లంఘనకు అవకాశం లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. మంగళవారం నగరంలోని జిల్లాధికారి కార్యాలయంలో అధికారులతో జిల్లా మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో కల్తీ విత్తనాలు విక్రయం జరుగుతున్నట్లు వస్తున్న వార్తలపై నిఘా ఉంచాలన్నారు. అదే సమయంలో రైతులకు సీజన్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగినన్ని రసాయనిక ఎరువులు విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల్లో తగిన చర్యలు చేపట్టాలన్నారు. చెరువు పూడికతీత పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలన్నారు.

రోడ్డుపై మురుగునీరు - ప్రయాణికులకు ఇక్కట్లు

హొసూరు, మే 22: హొసూరు సమీపంలోని అనుమేపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. హొసూరు సమీపంలోని జూజూవాడి కరుమారియమ్మ దేవాలయం మీదుగా వెళ్లే అనుమేపల్లి ప్రాంతంలో భారీ సంఖ్యలో పలు సంస్థలు ఉన్నాయి. ఈ రహదారిపై ప్రతిరోజూ వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి గుంతలమయంగా మారి ఇటీవల కురిసిన వర్షపు నీటితోపాటు మురుగునీరు కూడా రోడ్డుపై చేరింది. ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

ఎమ్మెల్సీ పోలింగ్ సమర్థవంతంగా నిర్వహించాలి



అధికారులకు అవగాహన కల్పిస్తున్న అధికారి సదాశివప్ప

రాయచూరు, మే 22 : ఈశాన్య పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణలో అధికారులు నిబంధనలు పాటించాలని అడిషనల్ జిల్లాధికారి అశోక్ దుడగుండి సూచించారు. జూన్ 3వ తేదీన నిర్వహించే ఈశాన్య పట్టభద్రుల నియోజక వర్గం శాసన మండలి(ఎమ్మెల్సీ) ఎన్నికకు సంబంధించి ఎన్నికల అధికారులుగా నియమితులైన వారికి బుధవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అదనపు జిల్లాధికారి బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించే ఎన్నికకు సంబంధించి ఇప్పటికే శిక్షణ పొందిన అధికారులు తమకు కేటాయించిన కేంద్రాలకు వెళ్లి పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేయడంతో పాటు సంబంధిత కేంద్రాలకు వాటిని తరలించడం వంటి పనులను నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు.

విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి



రైతులు, అధికారులతో సమావేశమైన సహాయ కమిసనర్ ఎస్ఎస్ సంపగావి

రాయచూరు, మే 22 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సహాయ కమిసనర్ ఎస్ఎస్ సంపగావి సూచించారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించిన సహాయ కమిసనర్, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్తీ విత్తనాలకు సంబంధించి ఫిర్యాదు అందిన తక్షణం స్పందించాలని సంబంధిత విత్తనాలను ప్రయోగశాలలకు పంపి నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు వ్యాపారం చేసే దుకాణాలపై దాడులు నిర్వహించి బాధ్యుల పై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

కె. రాఘవేంద్రరావు (పుట్టినరోజు)



దర్శకేంద్రుడిగా పేరొందిన కోవెలమూడి రాఘవేంద్రరావు 1942 మే 23న కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామంలో జన్మించారు. తండ్రి కేఎస్ ప్రకాశరావు కూడా దర్శకులే. తెలుగు సినీరంగంలో శతాధిక చిత్రాల దర్శకుడు. నిర్మాతగాను, స్క్రీన్ రైటర్‌గాను, కొరియోగ్రాఫర్‌గాను సత్తా చాటుకున్నారు. 1975లో 'బాబు' సినిమాతో దర్శకుడిగా తెరంగేట్రం చేశారు. స్త్రీ పాత్రలే ప్రధాన చిత్రాలతోపాటు అన్నమయ్య, శ్రీమంజునాథ, శ్రీరామదాసు, శిరిడిసాయి వంటి ఆధ్యాత్మిక సినిమాలు తీశారు. కొన్ని హిందీ, కన్నడ సినిమాలు కూడా తీశారు. ఐదు దశాబ్దాలలో దాదాపు అన్ని తరాల నటులతోనూ సినిమాలు తీసిన ఘనత ఆయనది. బుల్లితెరపైనా తనదైనముద్రను వేశారు. 8 నంది అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్, ఒక సైమా అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక 2015 నుంచి 2019 వరకు తిరుమల తిరుపతి దేవ స్థానం బోర్డులో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వ్యవహరించారు.

చంద్రమోహన్ (జయంతి)



చంద్రమోహన్ 1945 మే 23న కృష్ణా జిల్లా పమిడిముక్కల గ్రామంలో జన్మించారు. అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖరరావు. తెలుగు సినీరంగంలో ప్రముఖ క్యారెక్టర్ నటుడు. 1966లో 'రంగులరాట్నం'తో సినీ ప్రస్థానం ప్రారంభమైంది. కథా నాయకుడిగా 175కుపైగా మొత్తం 932 చిత్రాల్లో నటించారు. 7 నంది అవార్డులు అందుకున్నారు. పదహారేళ్ల వయసు, సిరిసిరిమువ్వ సినిమాలకు ఉత్తమ నటుడి పురస్కారాలు అందుకున్నారు. హాస్య పాత్రల్లోనూ, విలక్షణ పాత్రల్లోనూ, సహ నాయకుడి గాను రాణించారు. కొత్త హీరోయిన్‌లకు లక్కీ హీరోగా చంద్రమోహన్‌ను పేర్కొంటారు. 2023 నవంబరు 11న కన్నుమూశారు.

బెళ్తంగడి బీజేపీ ఎమ్మెల్యే అరెస్టుకు ఇంటివద్దే పోలీసుల మకాం



ఎమ్మెల్యే హరీశ్‌పూంజా ఇంటి వద్ద పోలీసులు, అభిమానులు

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌పూంజాను అరెస్టు చేసేందుకు పోలీసులు మకాం వేశారు. బుధవారం ఉదయం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బపూర్‌మఠ్, ఎస్సై చంద్రశేఖర్‌ల నేతృత్వంలో పోలీసుల బృందం బెళ్తంగడి తాలూకా గరడాడి గ్రామం మిథిల నివాసం వద్దకు చేరుకున్నారు. హరీశ్‌పూంజాను అరెస్టు చేస్తారనే సమాచారంతో ఆయన నివాసానికి న్యాయవాదుల బృందం చేరుకుంది. మరోవైపు పెద్దసంఖ్యలో కార్యకర్తలు గుమిగూడారు. ఎంపీ నళిన్‌కుమార్ కటీల్, బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బ్రిజేశ్‌చౌటలు గ్రామానికి వెళ్లారు. స్థాని బీజేపీ నాయకుడిని అక్రమంగా గనుల తవ్వకాలు, తవ్వకంతోపాటు పేలుడు పదార్థాలు నిల్వ ఉంచారనే ఆరోపణలతో అరెస్టు చేశారు. ఆయన అరెస్టును ఖండిస్తూ జరిగిన నిరసనలో ఎమ్మెల్యే హరీశ్‌పూంజా పాల్గొన్నారు. ఇదే సందర్భంలో పోలీసులను హెచ్చరించేలా మాట్లాడారని మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అరెస్టు అయిన కార్యకర్తలకోసం పోలీసుల చొక్కా పట్టుకునేందుకు వెనుకాడేది లేదని వ్యాఖ్యానించిన మేరకు హరీశ్‌పూంజాపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్‌తోపాటు పలువురు పోలీసులను దూషించడంతోపాటు ప్రాణాలు తీస్తామని బెదరించారని ఆరోపించారు. ఇవే అంశాలతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సోదరుడి ద్వారానే...

13 ఏళ్ల బాలిక గర్భవతి

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): బాలుడి ద్వారా 13ఏళ్ల బాలిక మూడు నెలల గర్భిణి అయిన ఘటన బెంగళూరు నగరం బాగలకుంటె పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకుని శిశువిహార్‌కు తరలించారు. వారిద్దరూ కవలలు. బాగలకుంటెలో తల్లిదండ్రులతో పాటు ఉన్నారు. తల్లిదండ్రులు లేనప్పుడు ఇద్దరూ కలసి అశ్లీల వీడియోలు చూసేవారని తెలుస్తోంది. ఇలా అలవాటుపడి నిరంతరంగా లైంగిక చర్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. బాలిక శరీరంలో మార్పులను గమనించిన తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు జరిపిన డాక్టర్లు మూడు నెలల గర్భిణిగా గుర్తించి బాగలకుంటె పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆసుపత్రికి చేరుకుని బాలుడిని అదుపులోకి తీసుకుని ప్రాథమికంగా విచారణ జరిపారు. సమగ్ర సమాచారంతో బాలుడిని శిశువిహార్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తూనే బాలికకు చికిత్సలు అందిస్తున్నట్టు బాగలకుంటె పోలీసులు బుధవారం తెలిపారు.

నమో.. నారసింహా..

వైభవంగా నరసింహస్వామి జయంతి

కదిరి, మే 22: నృసింహ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నారసింహ నామస్మరణతో ఆలయం మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఉమ్మడి జిల్లాతోపాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి తలనీలాలు, తులాభారం సమర్పించుకున్నారు.

తిరువీధుల్లో శ్రీవారి విహారం

నరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. శేషవాహనంపై ఆశీనులు గావించారు. అనంతరం స్వామివారు తిరువీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ద్రాక్షకు కనీస ధర లభించేనా..?

» కోతకు సిద్ధంగా పంట - రైతుల దిగాలు

శిడ్లఘట్ట, మే 22: శిడ్లఘట్ట పట్టణ, తాలూకా వ్యాప్తంగా సుమారు 650 ఎకరాలలో ద్రాక్ష సాగు అవుతోంది. దిల్‌ఖుష్, నల్లద్రాక్ష, శరత్, రెడ్‌గ్లోబ్ తదితర రకాలు ఎక్కువగా పండిస్తున్నారు. ఇప్పటికే దిల్‌ఖుష్ రకం కొన్నిచోట్ల కోతకుసిద్ధంగా ఉండగా మరికొన్ని చోట్ల కోత కోస్తున్నారు. ఇదివరకు కిలో 40-50 రూపాయలు ఉండేది. ప్రస్తుతం ధర కిలో రూ.25-30 పలుకుతుండడంతో గిట్టుబాటు లభిస్తుందా లేదా అనే అయోమయంలో రైతులు ఉన్నారు. చిక్కబళ్ళాపురలో ద్రాక్ష సాగులో శిడ్లఘట్ట తాలూకా ప్రముఖంగా ఉంది. ప్రస్తుతం కోతకు సిద్ధంగా పంట ఉండడంతో ధర తక్కువగా ఉన్నప్పటికీ కోత కోస్తున్నారు. మహారాష్ట్రలోని సాంగ్లి నుంచి ద్రాక్ష వస్తోందని, ఉత్తరాది రాష్ట్రాలలో వర్షాలు కురవడంతో ఆశించినంతగా ఎగుమతి కావడం లేదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. బంగ్లాదేశ్, జమ్ము, కశ్మీర్, ఉత్తర ప్రదేశ్, కోల్కత్తా, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు నాణ్యమైన ద్రాక్ష ఇక్కడ నుంచి ఎగుమతి అయ్యేదని ఇటీవల వర్షాల తో సాధ్యం కాలేదన్నారు. ద్రాక్ష రైతు కొత్తనూరు వెంకటేశప్ప మాట్లాడుతూ పంట కోతకు వచ్చినా ఆశించిన ధర లేదన్నారు. ఒకటిన్నర ఎకరాలలో ద్రాక్ష పంట కోతకు సిద్ధంగా ఉందన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ఎరువులు, మందులు వాడడంతో పంట దిగుబడి బాగా ఉందని అయితే ధర మాత్రం ఆశాజనకంగా లేదని విచారం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా పంట కోయాలని అప్పటికైనా కొంచెందర పెరుగుతుందేమో అనే ఆశగా ఎదురుచూస్తున్నట్టు తెలిపారు. పంట ఉత్తమ దిగుబడి సాధ్యమైనప్పటికీ కనీసధర లేకపోతే ఎలాగని పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న ద్రాక్ష తోట

లంచం తీసుకుంటే కఠిన చర్యలు: లోకాయుక్త ఎస్పీ

» లోకాయుక్త సభకు 6 అర్జీలు మాత్రమే

బాగేపల్లి, మే 22: ప్రభుత్వ సేవలలో జాప్యం, లంచం తీసుకున్నా చట్టరీత్యా చర్యలు తప్పవని చిక్కబళ్లాపుర జిల్లా లోకాయుక్త ఎస్పీ రామ్ ఎల్ అరసిద్ధి హెచ్చరించారు. తాలూకా కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన సమావేశంలో ప్రజల సమస్యలు ఆలకించారు. ఈ సందర్భంగా కేవలం 6 అర్జీలు రావడం గమనార్హం. పట్టణంలో కలుషిత నీటి సరఫరా, అటవీశాఖకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వారం రోజుల్లోగా పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో లోకాయుక్త మొబైల్ నెంబరుతో కూడిన కరపత్రాన్ని అతికించాలన్నారు. ప్రజల ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో లోకాయుక్త డీఎస్పీ వీరేంద్రకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మోహన్, తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్, సీఐ ప్రశాంత్ వర్ణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో లోకాయుక్త ఎస్పీ రామ్ ఎల్ అరసిద్ధి తదితరులు

బ్రిగేడ్ ఆర్కిడ్‌లో రామయ్య ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్యసేవలు



వైద్యసేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ ఎంఆర్ జయరాం, ఎంఆర్ జయశంకర్

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి బ్రిగేడ్ ఆర్కిడ్‌లో ఆధునాతన వైద్య సౌలభ్యాలను రామయ్య మెమోరియల్ ఆసుపత్రి సహకారంతో శ్రీకారం చుట్టారు. బుధవారం ఆసుపత్రిని గోకుల ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం, బ్రిగేడ్ గ్రూప్ చైర్మన్ ఎంఆర్ జయశంకర్‌లు ఆరంభించారు. బ్రిగేడ్ ఆర్కిడ్ 135 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైంది. అత్యవసర విభాగం, రేడియాలజీ, ల్యాబ్, ఓపీడీ సేవలు అందు బాటులోకి తెస్తున్నట్టు తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీతోపాటుపాటు అన్ని విధాలా వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్పొరేట్ ఉద్యోగులకు ఏటా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎంఆర్ జయరాం మాట్లాడుతూ బ్రిగేడ్ ఆర్కిడ్ స్మార్ట్ టౌన్‌షిప్‌గా ఉందన్నారు. ఇక్కడ నివసించేవారికి ఆరోగ్య సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తాము సహకరించామన్నారు. వైద్యనిపుణులు, సాంకేతిక నిపుణులు, పారామెడికల్ సిబ్బంది ఇక్కడ సేవలందిస్తారన్నారు. అందరికీ ఆరోగ్యం కల్పించాలన్నదే రామయ్య ఆసుపత్రుల ఆశయ మన్నారు. ఎంఆర్ జయశంకర్ మాట్లాడుతూ రామయ్య ఆసుపత్రుల భాగస్వామ్యంతో దేవన హళ్ళి సమీప ప్రాంతాల వాసులకు మెరుగైన వైద్యసదుపాయం అందుబాటులో ఉండాలనే ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్రీడాకారుల చికిత్సలకు హోస్మాట్‌లో ప్రత్యేక విభాగం

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థోపెడిక్ విభాగంలో పేరొందిన హోస్మాట్ క్రీడాకారుల చికిత్సలకోసం ప్రత్యేక విభాగం పనిచేస్తుందని ఆసుపత్రి ఫౌండర్ థామస్‌చాండీ ఒక ప్రకటనలో తెలిపారు. 1993 నుంచి హోస్మాట్ ఆసుపత్రి, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌కు వైద్య సేవలందిస్తోంది. చిన్నస్వామి స్టేడియంలో టెస్ట్‌మ్యాచ్‌లు, ఇంటర్నేషనల్ వన్డే మ్యాచ్‌లతోపాటు టీ-20 సహా అంతర్జాతీయ స్థాయిలో జరిగే టోర్నీలలో గాయపడిన క్రీడాకారులకు ఉచిత వైద్యసేవలు అందించిందన్నారు. క్రీడాకారులకోసమే ప్రత్యేక ఫిజియోథెరపీ విభాగం పనిచేస్తోందన్నారు. చిన్నస్వామి స్టేడియంకు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో 250 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి ఉంది. ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న తరుణంలో చిన్నస్వామి స్టేడియంలో సిబ్బంది, ప్లేయర్స్ మెడికల్ టీమ్ ప్రత్యేక విభాగంతో పనిచేస్తోందన్నారు. ఇద్దరు డాక్టర్లు, ఒక అనస్తీషియాతోపాటు అనుభవం కలిగిన పారామెడికల్ సిబ్బంది ఉన్నారు. పోర్టబుల్ డిజిటల్ ఎక్స్‌రే మిషన్, వెంటిలేటర్, ఆక్సిజన్ సిలిండర్ సదుపాయాలు ఉన్నట్టు ప్రకటించారు.



వైద్యబృందం

25న గంగమ్మదేవి పూల కరగ



ఉత్సవ సమితి కార్యదర్శి సుధాకర్ తదితరులు

బాగేపల్లి, మే 22: పట్టణంలోని గంగమ్మ దేవాలయ కరగ ఉత్సవాలు ఈనెల 23నుంచి 26 వరకు జరగనున్నాయని కరగ ఉత్సవ సమితి కార్యదర్శి ఏజీ సుధాకర్ వెల్లడించారు. పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ గ్రామదేవత గంగమ్మ ట్రస్టు, కరగ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ధర్మరాయ కరగ ఉత్సవం నాలుగురోజులపాటు జరుగుతుందన్నారు. ఏటా నిర్వహించినట్టుగానే 35వ వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. వేలూరు వహ్నికుల ధర్మేశ్, బృందం గంగమ్మదేవత సన్నిధిలో పూజలు చేస్తారన్నారు. గురువారం రాత్రి 7 గంటలకు పట్టణంలోని ఆవులమంద రోడ్డు యర్రకాలువ పక్క బైయప్పరెడ్డి ఇంటినుంచి హసికరగ మెరవణి ఉంటుందన్నారు. 24న శుక్రవారం సిడీరణ్ణ నేతృత్వంలో అన్ని వార్డులలో అగ్నిగుండ ప్రవేశంతో దీపోత్సవం జరుగుతుందన్నారు. 25న శనివారం దేవాలయంలో గంగమ్మదేవికి పంచామృతాభిషేకం, రాత్రి 8 గంటలకు విశేషపూజా కైంకర్యాలు ఉంటాయన్నారు. పట్టణంలోని విద్యాశిల్ప అకాడమీ ఆవరణలో గాజులు తొడిగే కార్యక్రమం ఉంటుదన్నారు. 9 గంటలకు పూల కరగ ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. 26న ఆదివారం సాయంత్రం ఆలయం ముందు ఒనకె కరగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరగ మహోత్సవ కోశాధికారి బీఆర్ నరసింహనాయుడు మాట్లాడుతూ తాలూకాలోని గడిదం లక్ష్మీవెంకటరమణస్వామి జాతర, గంగమ్మదేవి కరగ, హసేన్‌షావలి తాతయ్య ఉరుసు హిందూముస్లింల సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఉన్నాయన్నారు. కరగ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని భక్తులకు పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో కరగ మహోత్సవ సమితి పదాధికారులు జయప్రకాశ్ నారాయణ్, వాల్మీకినగర్ అశ్వత్థప్ప, మరియప్ప, గడ్డం నరసప్ప, సూర్యనారాయణరెడ్డి, పోతేపల్లి ఆదిమూర్తి, ప్రకాశ్, కన్నడ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డొనేషన్ల దందాను అడ్డుకోండి

బంగారపేట, మే 22: విద్యాసంవత్సరం ఆరంభమవుతుం దంటే విద్యార్థుల తల్లిదండ్రుల్లో గుబులు పుడుతోందని కొన్ని ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు డొనేషన్ల పేరిట ఇష్టం అడ్డూ అదుపులేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారని దళిత సమాజసేన రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ ఆక్రోశం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో బీఈఓ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదల రక్తాన్ని పీల్చే డొనేషన్ల దందాను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మౌనంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ నియమాల మేరకు ఏఏ తరగతులకు ఎంత డొనేషన్ వసూలు చేయాలి, బస్ ఫీజు, యూనిఫాం ఇతరత్రా వివరాలను నోటీసుబోర్డులో ప్రకటించాల్సి ఉందని అయితే చాలా ప్రైవేట్ పాఠశాలలు పాటించడం లేదని ఆరోపించారు. కొన్ని స్కూళ్లలో షూ, సాక్స్, పెన్, బ్యాగులను కూడా కొనుగోలు చేయాల్సి ఉంటుందని తల్లిదండ్రులపై ఒత్తిడి పెరిగిందన్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించకుంటే రానున్న రోజుల్లో తీవ్ర పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప, గోవింద, నవీన్, అర్జున్, మంజు, జాని, కార్యాధ్యక్షుడు ఎస్‌వీ మంజు తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ కార్యాలయం వద్ద దళిత సమాజసేన ప్రముఖులు

రేపు వీరభద్రస్వామి వజ్రోత్సవం

విజయపుర, మే 22: దేవనహళ్లి తాలూకా విజయపుర పట్టణంలో 63 దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న అక్కన బళగ ఆధ్వర్యంలో వీరభద్రస్వామి గోష్ఠి, సంఘం వజ్ర మహోత్సవం ఈనెల 24న జరగనుంది. 351వ మాసిక శివానుభవ గోష్ఠి, సామూహిక ఇష్టలింగపూజ, సంఘం నూతన పదా ధికారుల బాధ్యత శుక్రవారం ఉంటుందని సంఘం కార్యదర్శి సురేశ్‌బాబు ప్రక టనలో తెలిపారు. కార్యక్రమానికి విభూతిపుర సంస్థాన మఠాధిపతి డాక్టర్ మహంతలింగ శివాచార్య మహాస్వామిజీ సాన్నిధ్యం వహిస్తారని ఉదయం 9 గం టలకు అక్కన బళగ ఇంటి నుంచి వీరగాసె బృందం, ముత్తైదువులు పూర్ణకుంభ కళశాలతో నగరేశ్వరస్వామి ప్రార్థనా మందిరానికి భవ్యమెరవణి ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటలకు స్వామిజీ నేతృత్వంలో సామూహిక ఇష్టలింగ పూజ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు అమెరికా నివాసులైన గ్రీష్మ, ఆద్యలచే స్వాగతనృత్యం ఉంటుం దన్నారు. బెంగళూరు అయోధ్యనగర శివాచార్య నగర్త విద్యావర్ధక సంఘం అధ్యక్షులు ఎస్ ప్రకాశ్ ప్రారంభిస్తారని, నీ బసప్ప అధ్యక్షత వహించనున్నారు. కార్యదర్శి సురేశ్‌బాబు ప్రారంభోపన్యాసం చేయను న్నారు. బెంగళూరు నేటివ్‌డ్రీమ్ టెక్నాలజీస్ సంస్థాపకులు చందన్, సుజ్ఞానప్రియ సంపా దకత్వంలోని భక్తి నీరాజన కృతి ఆవిష్కరణ ఉంటుందన్నారు. బెంగళూరు విద్యా వర్ధక సంఘం కార్యదర్శి ఎంఎస్ కృష్ణమూర్తి, కోశాధికారి ఎం శంకర్, గోష్ఠి బళగ సంఘం గౌరవాధ్యక్షుడు పీ చంద్రప్ప తదితరులు పాల్గొంటారన్నారు.

కైవార కొండపై ట్రెక్కింగ్ సందడి

చింతామణి, మే 22: పట్టణ శివారులోని గోపసంద్రలో ఉన్న నమ్మ అఖాడ బ్యాడ్మింటన్ జట్టు సభ్యులు బుధవారం కైవార కొండకు ట్రెక్కింగ్ చేశారు. అటవీశాఖ అనుమతులతో ట్రెక్కింగ్ చేయడం విశేషం. తాలూకాలోని కైవార సమీపానగల ఈ కొండకు మహాభారత, రామాయణ ఇతిహాసాలు ఉన్నాయి. ఏకచక్రపుర ప్రాంతం క్రమేపీ కైవారగా పిలవబడుతోందని కథనం. కాలజ్ఞాని యోగి నారేయణతాతయ్య జీవసమాధి కావడంతో ఈ ప్రాంతం మరింత ప్రసిద్ధి చెందింది. ట్రెక్కింగ్‌జట్టులో నాగేంద్రగౌడ, నాగరాజ్, అర్జున్, బూస రాజేశ్, సుబ్రమణి, గోవర్ధన్, సంతోష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చదనం పరుచుకుందని ట్రెక్కింగ్ సభ్యులు తెలిపారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడం సంతోషం కలిగించిందన్నారు.



కైవారం కొండపై నీటికుంట వద్ద ప్రతిబింబాలతో ఇలా...

డీకే సురేశ్ ఇంట మంత్రులకు విందు

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది పాలన విజయవంతంపై డీసీఎం డీకే శివకుమార్ సోదరుడు, పార్టీ ఎంపీ డీకే సురేశ్ ఇంట బుధవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. కేబినెట్ మంత్రులతోపాటు కీలక నేతలు పాల్గొన్నారు. సీఎం సిద్దరామయ్య, మంత్రులు, రాజకీయ అంశాలపై చర్చలు జరిపారు. సీఎం, డీసీఎంలు స్వయంగా మంత్రులతోపాటు ముఖ్యనేతలకు ఆహ్వానించినట్టు సమాచారం.

వాహనాల కొనుగోలుకు కీలక ఒప్పందం

బెంగళూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): టాటా ప్యాసింజర్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థలో డీలర్‌షిప్‌లకు ఆర్థిక వెసలుబాటు కల్పించేందుకు బజాజ్ ఫైనాన్స్‌తో కీలక ఒప్పందం చేసుకుంది. బుధవారం బెంగళూరులో టాటా మోటార్స్ ప్యాసింజర్స్ వెహికల్స్ డైరెక్టర్ ధీమన్ గుప్త, బజాజ్ ఫైనాన్స్ సీఈఓ సిద్ధార్థభట్‌లు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ధీమన్‌గుప్త మాట్లాడుతూ డీలర్‌లు, భాగస్వామ్యులు, వ్యాపారంలో కీలకులని వారికి అవసరమైన ఆర్థిక వనరులు కల్పించేందుకు బజాజ్ ఫైనాన్స్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. సిద్ధార్థభట్ మాట్లాడుతూ వ్యక్తులు, వాణిజ్య వ్యవహారాలకు ఆర్థిక పరిష్కారాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. దేశవ్యాప్తంగా 83లక్షలమందికిపైగా ఖాతాదారులు ఉన్నారని కంపెనీ వ్యవహారాలు 3.30 లక్షల కోట్లుగా ఉన్నట్టు తెలిపారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి



బస్టాప్ సమీపాన పేరుకున్న చెత్తా చెదారం

చేళూరు, మే 22: పాతపాళ్యలో ప్రయాణీకుల సౌకర్యార్థం అదనపు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ఇటీవల కొంతకాలంగా రద్దీ పెరిగింది. దీంతో ప్రయాణీకులు హోటళ్లు, బేకరీ, దుకాణాల ముందు వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. త్వరలోనే విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థుల రాకపోకలు పెరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాలనుంచి విద్యార్థుల రాక క్రమేపీ పెరిగింది. కాగా పాతపాళ్య బస్టాండ్ ప్రదేశంలో స్వచ్ఛత కొరవడ్డంపై ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వర్షపునీరు సజావుగా వెళ్లేలా కాలువలలో పూడిక తీయాలని కోరుతున్నారు. బస్టాండ్ ప్రదేశంలో స్వచ్ఛతకు గ్రామపంచాయతీ పీడీఓ తగిన చొరవ తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

డెంగీ నియంత్రణపై జాగృతి



సమావేశంలో పాల్గొన్న పీడీఓలు

శిడ్లఘట్ట, మే 22: తాలూకాపంచాయతీ సభా భవనంలో తాలూకా పంచాయతీ ఈఓ సందీప్ అధ్యక్షతన గ్రామపంచాయతీ అధికారులకు బుధవారం డెంగీ, చికున్ గున్యా జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన నియంత్రణా చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాలూకా ఆరోగ్యా అధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి మాట్లాడుతూ డెంగీ అయినా, చికున్ గున్యా అయినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు పొందాలన్నారు. అలాగే చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా దోమల ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షాకాలం ప్రారంభం అవడంతో సాధారణంగా దోమలు ప్రబలే అవకాశాలు అధికమన్నారు. టైర్లు, చిప్పలు, ఇతరత్రా వాటిలో వర్షపునీరు ఇష్టం వచ్చినట్టు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏడీ చంద్రప్ప, తాలూకా ఆరోగ్య అధికారి ఎంఎస్ దేవరాజ్, అన్ని గ్రామ పంచాయతీల పీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

హిందూపురం అర్బన్, మే 22: పట్టణ పరిధిలోని చిన్న మార్కెట్ ప్రాంతంలో నెలకొన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో 28వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుక ల సందర్భంగా శుక్రవారం వరకు మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో హోమాలు రుద్రాభిషేకం పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. మూలవిరాట్‌ను సర్వాంగ సుంద రంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి జ్యోతుల మోశారు. అదే విధంగా గురువారం ఉదయంలి గంటలకు ఆలయంలో మూలవిరా ట్‌కు పంచామృతాభిషేకం, హోమాలు, పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టనున్నారు. భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావలెనని ఆలయ నిర్వాహకులు కోరారు.